ఐటీఐ విద్యార్థుల ప్రతిభ ఎనలేనిది



విజయం సాధించిన విద్యార్థులతో రాణి కుముదిని, జేడీ ఎస్వీకే నగేశ్ తదితరులు

విజయనగర్‌కాలనీ: ఐటీఐ విద్యార్థుల్లో ప్రతిభకు కొదవలేదని కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఐ.రాణి కుముదిని అన్నారు. ఇండియా స్కిల్స్ కాంపిటీషన్స్ 2024 పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థుల అభినందన కార్యక్రమాన్ని మల్లెపల్లి ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలోని ఉపాధి శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి కుముదిని మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని ప్రతిభను బాహ్య ప్రపంచానికి తెలియజేసేందుకు పోటీ పరీక్షలు దోహద పడుతాయన్నారు. ఉపాధి శిక్షణ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్వీకే నగేశ్ మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగాల అవసరాల మేరకు నైపుణ్యవంతులైన సాంకేతిక నిపుణులను ఐటీఐల ద్వారా అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాలువా కప్పి మెడల్స్ అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్యారం నర్సయ్య, రాష్ట్ర సమన్వయ కర్త జి.ప్రశాంతి పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి



గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో ఓపీ విభాగంలో క్యూలో ఉన్న రోగులు

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రికి రోగుల తాకిడి పెరిగింది. ఇటీవల కురిసిన వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలడంతో కొన్ని రోజులుగా ఆసుపత్రి ఓపీ రిజిస్ట్రేషన్ విభాగం ఉదయం 7.30 నుంచే వద్ద రోగులు బారులు తీరుతున్నారు. గోల్కొండ ఏరియా ఆసుపత్రికి రోజుకు 700–800 మంది ఔట్ పేషంట్లుగా వస్తున్నారని తమ ఆసుపత్రిలో అన్ని విభాగాలకు నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మజహరుల్లా తెలిపారు. రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని అడ్మిట్ చేసి చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. పలువురు బస్తీ దవాఖానలకు సైతం వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.

ప్రభుత్వాసుపత్రుల వద్ద నిత్యాన్నదానం



ఆసుపత్రి వైద్యులతో మహ్మద్ బషీర్

గోల్కొండ: ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద రోగులకు నిత్యాన్నదానం కార్యక్రమాన్ని నిర్వీరామంగా కొనసాగిస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు ప్రభుత్వ సెకండ్ లాన్సర్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఎంఎన్‌జే కేన్సర్ దవాఖాన వద్ద వైద్యులతో కలిసి రోగుల సహాయకులకు బుధవారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 798 రోజులుగా నిత్యం 70–100 మందికి భోజన ప్యాకెట్లతో పాటు వాటర్ బాటిల్స్ కూడా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఆసుపత్రుల సిబ్బంది, డాక్టర్లు కూడా సహకరిస్తున్నారని పేర్కొన్నారు. తమను చూసి యువజన సంఘాల వారు కూడా తమవంతుగా ఆసుపత్రులు, లేబర్ అడ్డాల వద్ద అన్నదానంతో పాటు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

కార్వాన్ లక్ష్మీ నరసింహస్వామి జయంత్యుత్సవాలు



పూజలు చేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

జియాగూడ: చారిత్రక శాహుకారి కార్వాన్‌లో గల ఏకశిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంత్యుత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజాము ఐదు గంటల నుంచే స్వామివారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకరణ, భజనతో పాటు శ్రీ శివ శంకర క్రాంతి సేవా సమితి ఆధ్వర్యంలో మహా అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు కడాల అనంత్ కృష్ణ, శ్యామ్ లింగం, ఎన్.శ్రీకాంత్, మణికంఠరావు, వినిత్, పి.గోపి, పవన్, సురేందర్, జియాగూడ టీడీపీ అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: గౌలిపురాలోని శ్రీ సరస్వతీ శిశు విద్యా మందిర్ పాఠశాల గల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో కె.రాజు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అర్ధరాత్రి తిరుగుతున్న వారికి కౌన్సిలింగ్



యువకుడితో మాట్లాడుతున్న మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్

గౌలిపురా: అర్ధరాత్రి వేళ అనవసరంగా రోడ్లపై తిరిగే వారిపై చర్యలు తీసుకుంటామని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ హెచ్చరించారు. మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ఆయన వాహనాల తనిఖీ, అనవసరంగా రోడ్లపై తిరుగుతూ ఛబుత్రాలపై కూర్చుంటున్న వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఏం చేస్తున్నారనే విషయాలపై ఓ కన్నేసి ఉంచాలన్నారు. యువకులను వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించామని తెలిపారు.

ట్రాఫిక్ రద్దీతో రంది..!

- బంజారి దర్వాజ వద్ద వాహనదారుల తిప్పలు
- ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని వేడుకోలు



బంజారి దర్వాజ వద్ద నిలిచిన వాహనాలు

గోల్కొండ: గోల్కొండ బంజారి దర్వాజ వద్ద నిత్యం ట్రాఫిక్ రద్దీ నెలకొంటున్నది. ముఖ్యంగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ దర్వాజ గుండా వాహనాదారులు రాకపోకలు సాగించాలంటేనే జంకుతున్నారు. ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బంది ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. షేక్‌పేట్, అల్కాపూర్, షేక్‌పేట్‌నాలా తదితర ప్రాంతాల నుంచి గోల్కొండ వెళ్లే వారు బంజారి దర్వాజ గుండానే వెళ్తుంటారు. మరోవైపు గోల్కొండ నుంచి టోలిచౌకీ, షేక్‌పేట్ నాలా వైపు వెళ్లే గోల్కొండ వాసులు సైతం ఈ దారి గుండానే రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు కోటకు వచ్చే పర్యాటకులు కూడా వస్తుంటారు. ఇదిలా ఉండగా దర్వాజ మధ్యలోని రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనాలు నెమ్మదిగా వెళ్తుంటాయి. ముఖ్యంగా ఉదయం కార్యాలయాలకు వెళ్లే వారు కనీసం 20 నిమిషాలు ట్రాఫిక్‌లోనే ఇరుక్కుపోతున్నారు. పాదాచారులు కూడా ముందుకు కాలు వేసే పరిస్థితి లేకుండాపోతుందని వాపోతున్నారు. చిరువ్యాపారులు, తోపుడు బండ్ల వారు గోల్కొండకు వెళ్లాలన్నా.. గోల్కొండ నుంచి బయటకు రావాలన్నా.. బంజారి దర్వాజ ఒక్కటే దారి.

ట్రాఫిక్ తగ్గాలంటే..

సెవెన్ టూమ్స్ చౌరస్తా నుంచి బంజారి దర్వాజా గుండా గోల్కొండకు వెళ్లే రోడ్డుకు ప్రత్యామ్నాయంగా గోల్ఫ్ కోర్సు రోడ్డును వాడాలని వాహనాదారులు కోరుతున్నారు. గోల్కొండ కోటలో బోనాలు, ఇతర ఉత్సవాల సమయంలో ట్రాఫిక్ అధికారులు హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్ వారితో మాట్లాడి బంజారి దర్వాజ నుంచి గోల్ఫ్ కోర్టు మీదుగా జమాలి దర్వాజకు వైపు వాహనాలను మళ్లిస్తున్నారు. అయితే ఈ రోడ్డును శాశ్వతంగా ఉపయోగించాలని పలువురు కోరుతున్నారు. ఈ రహదారి గుండా వెళ్తే గోల్ఫ్ ఆడుతున్న వారికి ఎలాంటి ఆటకం ఉండదని పలువురు అంటున్నారు. తూమ్స్ చౌరస్తా నుంచి కేవలం నయాఖిలా వెళ్లే వాహనాలకు మాత్రమే గోల్ఫ్ కోర్టు గుండా అనుమతి ఇస్తే బంజారి దర్వాజ వద్ద ట్రాఫిక్ తగ్గుతుందని అధికారులు ఆ దిశగా ప్రయత్నం చేయాలని వాహనాదారులు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ అవస్థలు..?

- వర్షం వస్తే లోతట్టు ప్రాంతాలు జలమయం
- రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద నిలుస్తున్న వరద
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- గంటల తరబడి రోడ్లపైనే నిలిచిపోతున్న వాహనాలు
- శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్న ప్రజలు



ఇటీవల కురిసిన వర్షానికి డబీర్‌పురా రోడ్డు వరదలో చిక్కుకున్న వాహనాలు

చార్మినార్: పాతబస్తీలో వర్షం కురిసినప్పుడల్లా లోతట్టు ప్రాంతాల్లో వరద నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నది. నీటిని ఎప్పటికప్పుడు తొలగించే యంత్రాంగం అందుబాటులో లేకపోవడంతో వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వరదను ఎప్పటికప్పుడు మోటర్ పంపులతో తొలగించే ఏర్పాట్లు చేయాలని, అలాగే డ్రైనేజీ పైపులైన్ వ్యవస్థను కూడా పునరుద్ధరించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జిల కింద నిలుస్తున్న వరద..

పాతబస్తీ నుంచి తూర్పు వైపు వెళ్లే వాహనదారులకు వర్షం వచ్చినప్పుడల్లా ఇబ్బందులు తప్పడం లేదు. పురానాపూల్, ఘాన్సీబజార్, చార్మినార్, కోట్ల ఆలిజా, మీరాలమండి, డబీర్‌పురా, లాల్‌దర్వాజా, శాలిబండ తదితర ప్రాంతాల వాహనదారులు సైదాబాద్, సంతోష్‌నగర్, చంచల్‌గూడ, రెయిన్‌బజార్, చావునీ, కుర్మగూడ, ఆజంపురా, మలక్‌పేట్ తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు యాకుత్‌పురా, ఆజంపురా, లలితాబాగ్, జీఎం చావునీ రైల్వే అండర్ బ్రిడ్జిలే ప్రధాన మార్గాలు. వీటితో పాటు డబీర్‌పురా, కందికల్‌గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ రైల్వే అండర్ బ్రిడ్జిల రహదారుల్లోనే పెద్ద ఎత్తున వరద నిలిచిపోతుండడంతో వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది.

శాశ్వత పరిష్కారం చూపాలంటున్న వాహనదారులు..

అక్కడక్కడ ఎమర్జెన్సీ టీమ్‌లు పని చేస్తున్నా.. పూర్తిస్థాయిలో రాకపోకలను పునరుద్ధరించలేకపోతున్నారు. దీంతో గంటల తరబడి ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. లోతట్టు రోడ్లన్నీ వరదతో నిండిపోతున్నాయి. పాతబస్తీలోని యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల పరిధిల నుంచి ప్రధాన రైల్వే మార్గం ఉండడం.. అటు నుంచి ఇటూ (చార్మినార్, బహదూర్‌పురా నియోజక వర్గాలు) రాకపోకలు సాగించే వారికి రైల్వే అండర్, ఓవర్ బ్రిడ్జిలు ఉన్నాయి. ఇందులో రైల్వే అండర్ బ్రిడ్జిల రోడ్డుపై వరద భారీ ఎత్తున నిలిచిపోవడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. మలక్‌పేట్, డబీర్‌పురా, యాకుత్‌పురా, ఉప్పుగూడ, ఫలక్‌నుమా తదితర ప్రధాన రైల్వే స్టేషన్లు పాతబస్తీలో ఉన్నాయి. ఈ రైల్వే స్టేషన్ల పరిధిలోని వాహనదారులు, స్థానికులు వర్షాలు పడినప్పుడల్లా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

బాలుడి అదృశ్యం



సుమిత్ సింగ్

అబిడ్స్: మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీతారామ్‌బాగ్ గోషాకత్ ప్రాంతంలో బాలుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ అస్లాం తెలిపిన వివరాల ప్రకారం.. గోషాకత్ ప్రాంతంలోని సుమిత్ సింగ్(17) ఈ నెల 10వ తేదీన ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో వారు మంగళ్‌హాట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందీ, తెలుగు భాషల్లో మాట్లాడే సుమిత్ సింగ్ ఆచూకీ తెలిస్తే మంగళ్‌హాట్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారు కోరారు.

రైలు కిందపడి గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

నాంపల్లి: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్ జీఆర్పీ పోలీసు స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్–బోరబండ రైల్వే స్టేషన్ల మధ్యలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు (35) వయస్సు గల గుర్తు తెలియని యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకోగా తల మొండెం నుంచి వేరు పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. సంబంధీకులెవరైనా ఉంటే హైదరాబాద్ జీఆర్పీ పోలీసులు లేదా 9000394635 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

భర్త ఇతరులతో గొడవపడుతున్నాడని మహిళ ఆత్మహత్య

నాగోలు: పాలను నిల్వ చేయడానికి ఉపయోగించే రసాయన ద్రవాన్ని తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మన్సూరాబాద్ శైలజాపురి కాలనీకి చెందిన బొల్లు మల్లేష్, మంజుల (37) భార్యాభర్తలు. మల్లేష్ స్థానికులతో బుధవారం చిన్న చిన్న విషయాలపై గొడవ పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడు. గొడవలతో మనస్తాపం చెందిన భార్య మంజుల ఇంట్లో ఉన్న పాలను నిల్వ చేసేందుకు వినియోగించే రసాయన ద్రవాన్ని తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను వెంటనే కుటుంబ సభ్యులు వనస్థలిపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయిందని తెలిపారు. మృతురాలి కుమార్తె సోనీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువాం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చార్మినార్, ఫలక్‌నుమా పరిధిలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్, ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చందులాల్ బారాదరి విద్యుత్ ఫీడర్ పరిధిలోని చందులాల్‌బారాదరి, ఖాజా ఫంక్షన్ హాల్, రాంనాస్‌పురా, బహదూర్‌పురా, ప్రిన్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఐటీఐ విద్యుత్ ఫీడర్ పరిధిలోని కమేలా, రెహ్మత్‌పురా తదితర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, ఫైర్ స్టేషన్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఈగిల్ రబ్బర్ ఫ్యాక్టరీ, దాల్ మిల్, సారో రబ్బర్, జాయ్ కాట్, మెర్క్యురీ ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు కరెంట్ ఉండదని తెలిపారు. ఎస్సార్టీ కాలజీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని చందులాల్ బారాదరి, ఎస్సార్టీ కాలనీ, 2 ఆర్టీ కాలనీ, అబ్దుల్లా షా దర్గా, గుల్షాన్ నగర్, ఎస్సార్టీ గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో..

సీఆర్‌పీఎఫ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్, క్యాంపస్, కేశవగిరి విద్యుత్ ఫీడర్ పరిధిలోని కేశవగిరి, కుమ్మర్‌వాడి, చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్, దాస్ స్కూల్, బీఎన్‌కే కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఖాజానగర్, ఈద్గా, బీఎన్‌కే కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు. అలాగే సలాల, గౌసియా మసీద్ తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని సలాల, చక్కీ పహాడ్, పీలీ దర్గా, కొత్తపేట్ రోడ్, నబీల్ కాలనీ, సబీ ఉల్ సలాం, మదీనా మసీద్, నీలం ఐస్ ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 వరకు, జమాల్‌బండ, రషీద్ కాలనీ తదితర విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేవీ.రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సాహితీ జిగీష ఆధ్వర్యంలో రచయిత్రి డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మి రచించిన సాహితీ చంద్రిక పుస్తకావిష్కరణ సభను రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ.రమణాచారి మాట్లాడుతూ.. పలు విషయాలను రచయిత్రి ఎంతో చక్కగా విశ్లేషించారని కొనియాడారు. కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, గురుకుల విద్యాలయ సంస్థ విశ్రాంత ప్రధానాచార్యులు ఎం.దత్తాత్రేయశర్మ, తెలుగు విశ్వ విద్యాలయం విశ్రాంత ఆచార్యులు వి.నిత్యానందరావు, పూర్వ రిజిస్ట్రార్ టి.గౌరీశంకర్, హాస్య అవధాని శంకర నారాయణ, సంస్థ అధ్యక్షుడు రాంచంద్ర రావు, ప్రధాన కార్యదర్శి లలితావాణి తదితరులు పాల్గొన్నారు.

పంటమార్పిడి విధానాన్ని అవలంబించాలి

నాబార్డ్ తెలంగాణ డిప్యూటీ జనరల్ మేనేజర్ దీప్తి సుదీప్



నాబార్డు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: రైతులు పంటల అధిక దిగుబడుల కోసం సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా వ్యవసాయ అధికారుల సిఫార్సు మేరకు పంటమార్పిడి విధానాన్ని తప్పనిసరిగా అవలంబించాలని నాబార్డ్ తెలంగాణ డిప్యూటి జనరల్ మేనేజర్ దీప్తి సుదీప్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో జరిగిన వినియోగదారుల సదస్సు రెండోరోజు సమావేశం జరిగింది. ఈ ముగింపు సమావేశంలో ఆమె పాల్గొన్ని మాట్లాడారు.

వాతావరణ మార్పులకనుగుణంగా..

రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా భూసార పరీక్షలు చేసి వ్యవసాయం చేయాలని తప్పనిసరిగా లాభాలు ఉంటాయని సూచించారు.

- మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను వేయలని, కోవిడ్‌లో అనేక రంగాలు మూత పడినా.. వ్యవసాయరంగం సఫలమైందని పేర్కొన్నారు.
- వ్యవసాయ ఉత్పత్తి సంఘాల రైతులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను అమలు చేసి అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, విస్తరణ విద్యాసంస్థ అధికారులు, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

దళితుల భూమి కబ్జాపై ఫిర్యాదు



మట్టితో చదును చేసిన దృశ్యం

శంషాబాద్: 50 ఏళ్ల నుంచి రెవెన్యూ రికార్డుల పరంగా తమ ఆధీనంలో ఉన్న భూములను పక్కనే వెంచర్ నిర్వాహకులు కబ్జా చేస్తున్నారని బ్యాగరి కుటంబాలకు చెందిన వ్యక్తులు తహసీల్దార్ నాగమణికి ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన ఎస్.ఎస్ రవికుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులతో పాటు పోలీసుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. పట్టణంలోని సర్వేనంబరు 23లో 2.15 ఎకరాల భూమి దళితులైన బ్యాగరి వృత్తిదారులకు సంబంధించిన భూమి ఉందన్నారు. తమ కుటుంబాలకు సంబంధించిన స్వర్గస్తులైన వారి సమాధులు కూడా అక్కడే ఉన్నాయన్నారు. గత రెండ్రోజులుగా అర్ధరాత్రి సమయంలో పెద్దఎత్తున రాళ్లు వేసి మట్టితో చదును చేశారన్నారు. సమీపంలోనే ఉన్న కొందరు వ్యక్తులే కబ్జాకు కారణమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. అధికారులు సర్వే నంబరు 23 సర్వేను త్వరగా పూర్తిచేసి బ్యాగరి వృత్తిదారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కబ్జాకు యత్నిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సిటీ కాలేజీ సుజాతకు డాక్టరేట్

చార్మినార్: ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ సహాయ ఆచార్యులు సుజాత అజ్మీరాకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. 'మూడ్ కృష్ణా నాయక్ జీవితం-సాహిత్యం' అనే అంశంపై తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిల్మా నాయక్ పర్యవేక్షణలో సుజాత సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి ఓయూ పీహెచ్‌డీ ప్రకటించింది. తెలుగు సాహిత్యంలో ఒక ప్రముఖ గిరిజన కవి గురించి పరిశోధన చేసిన సుజాతకు డాక్టరేట్ రావడంతో బుధవారం సిటీ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ బాల భాస్కర్‌తో పాటు బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

చార్మినార్: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీతో పాటు సహా విదేశాంగ మంత్రి దుర్మణంపై అంతర్జాతీయ న్యాయస్థానంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రముఖ న్యాయవాది, ఏఐఎంఐఎం ఇంక్విలాబ్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ డిమాండ్ చేశారు. ఇటీవల ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేసిన నేపథ్యంలో ప్రతీకార చర్యగా ఇజ్రాయెల్ ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చని ఆయన ఆరోపించారు.

'400 ఎంపీ స్థానాలు బీజేపీవే'

గోల్కొండ: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 400 స్థానాల్లో గెలుస్తుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కంది మోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రధానిగా నరేంద్రమోదీ పదేళ్లలో తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలే వల్లే ప్రస్తుతం మన దేశం ఆర్థికంగానే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ అగ్రదేశాల సరసన చేరిందని పేర్కొన్నారు. తెలంగాణలో సైతం అత్యధిక స్థానాలు తమ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదానం చేస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

గౌలిపురా: స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాలస్వామి కోరారు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 12వ తేదీన జరిగిన బుల్లెట్ బైక్ పెట్రోల్ ట్యాంక్ పేలిన ఘటనలో గాయపడి కంచన్‌బాగ్ అపోలో డీఆర్‌డీఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఏఆర్ కానిస్టేబుల్ సందీప్ కోసం బుధవారం ఆయన రక్తదానం చేశారు.

పారిశుధ్యంపై పట్టింపేది..!

- టోలిచౌకీ, గోల్కొండ డివిజన్లలో రోడ్లపైనే చెత్తాచెదారం
- దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు



తూమ్స్ రోడ్డు వద్ద చెత్తను తింటున్న పశువులు

గోల్కొండ: శానిటేషన్ అధికారులకు పారిశుధ్య పనులపై చిత్త శుద్ధి లేకుండాపోతోంది. పేరుకుపోతున్న చెత్తాచెదారం వల్ల మనుషులకే కాకుండా మూగజీవాలు సైతం రోగాల బారినపడుతున్నాయి. టోలిచౌకీ, గోల్కొండ తదితర డివిజన్‌లో ప్రధాన కూడళ్లు, రహదారుల పక్కన రోజుల తరబడి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా వార సంతలు జరిగే సెవన్ టూమ్స్ రోడ్డు, గోల్కొండ, రేతిగల్లి, ఫతేదర్వాజా తదితర ప్రాంతాల్లో రోజుల తరబడి వారపు సంత వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వస్తుండడంతో పాటు ఈగలు, దోమలు లాంటి కీటకాలు విజృంభించి స్థానికులకు రోగులు వ్యాపింపజేస్తున్నాయి. గోల్కొండ రేతిగల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, ఓవైసీ ప్లేగ్రౌండ్, స్విమ్మింగ్ పూల్స్ వద్ద చెత్త కుప్పల పక్క నుంచి వెళ్లే వారు దుర్వాసనతో ముక్కు మూసుకుంటున్నారు.ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం తక్కువ బరువు బ్యాగులు



తక్కువ బరువు గల వివిధ రకాల స్కూల్ బ్యాగులు

చార్మినార్: విద్యార్థుల సౌకర్యార్థం తక్కువ బరువు గల స్కూల్ బ్యాగులు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. మదీనా సర్కిల్‌లోని మహ్మద్ క్యాప్ మార్ట్ కేవలం 100 గ్రాముల అతి తక్కువ బరువు గల బ్యాగ్‌లను రూపొందించింది. ఈ బ్యాగులోని పుస్తకాలు వర్షానికి కూడా తడవకుండా ఉంటాయని మహ్మద్ క్యాప్ మార్ట్ యజమాని ఇలియాస్ బుకారీ తెలిపారు.

నెల రోజుల పాటు ఎగ్జిబిషన్..

మదీనా సర్కిల్‌లోని తన షో రూంలో నెల రోజుల పాటు సాగే ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇవేగాకుండా అన్నిరకాల బ్రాండెడ్ బ్యాగులు కూడా అందుబాటులో ఉన్నాయని వాటిలో కొన్నిటిపై డిస్కౌంట్ ఉందని తెలిపారు.

సమస్యలను పరిష్కరించండి

దిల్‌సుఖ్‌నగర్: ఇటీవల కురిసిన వర్షాల వల్ల కాలనీల్లో ఏర్పడిన రోడ్డు గుంతలు, డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులకు సూచించారు. ఆర్‌కే పురం డివిజన్‌లోని హరిపురి కాలనీ, జనప్రియ గార్డెన్, సరోజినీ నగర్ కాలనీల్లో బుధవారం ఆమె పర్యటించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రోడ్ల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ, రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి రోడ్లు గుంతలు పడ్డాయని, డ్రైనేజీ పొంగిపొర్లి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటితో తమ కాలనీలోని ఇళ్లు మునిగిపోతున్నాయని కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి కాలనీలోకి వర్షం నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ ఈశ్వర్, వాటర్ వార్క్స్ ఏఈ రామకృష్ణారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్, గౌడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.